# కిటికీ వెనుక అమ్మాయి

రచన :
శ్రీ బత్తుల వి. దుర్గాప్రసాదరావు

ఆమె అక్కడే వుంది! చిన్నగా నవ్వుతోంది!

నే నా ఇంటిని దాటి వెళ్తున్నప్పుడు, వస్తున్నప్పుడు ఆమె ఆ గది కిటికీ వెనుక కనిపిస్తోంది.

మొదట చూసీ చూడనట్టు, తర్వాత చూడాలన్నట్టు, ఇప్పుడిప్పుడు చూడందే వుండ లేనన్నట్టు చూస్తున్నాను నేను—ఆమెను.

నేను తాలూకాఫీసులో 'ఎల్డీసి'గా పని చేస్తున్నాను.

ఉద్యోగరీత్యా నే నీ వూరు వచ్చి, ఆ 'కిటికీ వెనుక అమ్మాయి' వుంటున్న వీధిలో చివరింటిలో, సింగిల్ రూంలో ఉంటున్నాను — 15 రోజుల నుంచి.

ఆమెను ఒక రోజు యాదృచ్ఛికంగా చూశాను. మర్నాడు పరిశీలనగా చూశాను. ఆ మర్నాడు కోరి చూశాను. అప్పటినుంచి ప్రతిరోజు ఆమెను చూడటం ఒక అలవాటుగా మార్చుకున్నాను.

నిజానికి ఆమె చాలా అందంగా వుంటుంది. చాలా అందంగా చూస్తోంది. చాలా అందంగా నవ్వుతోంది—

'ఆమె కూడా నన్ను ప్రేమిస్తోందా?'— సడన్‌గా ఒకరోజు నన్ను నేనే ప్రశ్నించుకున్నాను...

వెంటనే సమాధాన పడ్డాను. లేకపోతే ఆమె ఎందుకలా చూస్తోంది?...ఎందుకలా నవ్వుతోంది?... నే నాఫీసుకు వెళ్ళే, వచ్చే టైమింగ్స్‌లో తప్పక ఆ కిటికీ దగ్గర ఎందుకు వుంటుంది?—

పై అందమైన తలంపులతో ప్రతిక్షణం నా మనసు సన్నగా పులకరిస్తోంది.

రెండు మూడుసార్లు పరిశీలిద్దామని, ప్రతి సారిలా కాకుండా, ఆఫీసుకు వెళ్ళేటప్పుడు అర గంట ముందుగా, వచ్చేటప్పుడు అరగంట ఆలస్యంగా టైమింగ్స్‌ను మార్చాను. అయినా ఆమె అక్కడే వుండేది!—

నే నెప్పుడు వెళ్ళిపోతాననేమో, ఎప్పుడు వచ్చేస్తాననేమో, ఆమె ఎప్పటినించి ఆ కిటికీ వెనుక వేచి వుంటుందో!—మనసు చివుక్కుమనేదా క్షణాల్లో. అంతలోనే మనసు పులకరించేది, ఏదో మధుర భావాలతో.

ఇంత 'ఇది'గా ప్రేమిస్తున్న ఈ 'కిటికీ వెనుక అమ్మాయి'ని చెయ్యి జార్చుకోకూడదు. ధైర్యం చేసి, చొరవ తీసుకొని ఆమెతో నా మనసులో భావాలను కూడా చెప్పేయాలన్న ఆతృత నాలో రానురాను అధికమవుతోంది...

'కానీ ముందు నెలరోజుల క్రితం మా పెద్దలు కుదిర్చిన నా పెళ్ళిసంబంధాన్ని వదిలించుకోవాలి. తర్వాత లేనిపోని గొడవల్లో చిక్కపోకూడదు'—అనే అభిప్రాయంతో, ఆలోచించి, ఆలోచించి, మా వాళ్ళకి ఇలా ఉత్తరం రాసి పడేశాను :

"ఆ విజయవాడ అమ్మాయి 'గుణం' మంచిది కాదని తెలిసింది. ఎలా అని అడక్కండి. వాళ్ళు మన గొంతెమ్మ కోరికలన్నింటినీ ఒకేదఫాలో వొప్పేసుకొన్నారంటే, ఆ విషయం నిజమే కావచ్చు. లేనిపోని తలనొప్పి ఎందుకుకాని, వాళ్ళిచ్చిన అడ్వాన్స్‌ను వాళ్ళకు పంపేస్తూ, ఆ సంబంధాన్ని విడిచిపెట్టేయండి. త్వరలో మీతో కొన్ని విషయాలు ముఖాముఖీ మాట్లాడగలను."

*  *  *

మర్నాడు ముహూర్తం బాగుందని పంతులుగారు (అయిదురూపాయలిచ్చి నేనడిగినప్పుడు) చెప్పడంతో, ఏదో లా ఆ 'కిటికీ వెనుక 'అమ్మా

యితో, నా మనసులో భావాలను మాటలలో చెప్పేయాలని నిర్ణయించుకున్నాను.

ఆ రాత్రి రంగులలో ఎన్నెన్నో కలలు నన్ను పూరించాయి.

'అందమైన అనుభూతి'తో నేను నిద్రలోంచి లేచేసరికి వీధిలో హడావిడి ఏదో జరుగుతున్నట్టు గ్రహించి, వీధి తలుపులు తీసుకొని బయటికి వచ్చాను.

ఆ 'కిటికీ వెనుక అమ్మాయి' ఇంటి ముందు ఏదో హడావిడిగా వుంది.

అప్పుడే అటునించి పనిపిల్ల రావడం చూశాను, అది నా రూం తుడుస్తోంది. త్రాగేందుకు, స్నానానికి నాకు సరిపడ్డ నీళ్ళు పోస్తోంది.

"ఏమిటే, ఆ గొడవా?" పనిపిల్లని అడిగాను.

"ఆ ఇంటమ్మాయి, ఆ ఎదురింటబ్బాయితో లేచిపోయిందట, బాబూ! పొద్దున్ననుండి ఆ ఇద్దరూ అగుపించడం లేదట. చెరో చీటీలు మాత్రం రాసిపోయినారట."

గతుక్కుమన్నాను.

పనిపిల్ల పనిలోకి వెళ్ళిపోతూంటే, దాన్ని ఆపి, అడిగాను: "ఆ ఇంటి అమ్మాయి అంటే, ఆ 'కిటికీ వెనుక అమ్మాయా?" (పనిపిల్లకు 'ఆమె' తెలుసో, తెలీదో అని ఆ క్షణాల్లో ఆలోచించ (లేకపోయాను) లేదు మరి).

"ఆఁ, అవును, బాబూ! ఆ పిల్లే. మీరూ చూశారా? మరి ఎప్పుడూ ఆ కిటికీకాడే వుంటుందాపిల్ల. ఆ ఎదురింటి పిల్లోడు, అలాగే, తన గది కిటికీకాడే వుంటాడు. ఎప్పుడు చూసినా ఆ ఇద్దరూ ఇకఇకలు, పకపకలు... అప్పుడే ఆ పెద్దోళ్ళు జాగ్రత్త పడితే..."

పనిపిల్ల చెప్పుకుపోతుంది. నాకదేవీ వినిపించడం లేదు...

తొందరపాటుతో ఎంతగా భ్రమ పడ్డాను—ఛ ఛ—

చాలాసేపు తేరుకోలేకపోయాను. పిమ్మట త్వరత్వరగా మొహం కడుక్కొని, అంతే వేగంతో బట్టలు మార్చుకొని, గబగబా లీవ్ లెటర్ రాసేసి, పనిపిల్లను పిలిచాను. అది నా చర్యలన్నింటినీ గమనిస్తోందేమో, ఏదోలా నా వంక చూస్తోంది!

"దీన్ని ప్రక్కవీధిలో వుంటున్న నాకో-ఎంప్లాయ్ రాజారావుకు నే నిచ్చానని ఇవ్వు. నేను అర్జంట్‌గా మా వూరు వెళ్తున్నానని చెప్పు" అంటూ లీవ్ లెటర్‌ని పనిపిల్లకు ఇచ్చేసి-

"నీవు రేపు పనిలోకి రావద్దు. ఎల్లుండి రా" అని దానితో చెప్పాను.

పనిపిల్ల వెళ్ళిపోయింది.

రూంకు తాళంవేసి, వీధిలోకి నడిచాను నేను.

ఆ 'కిటికీ వెనుక అమ్మాయి' ఇంటిముందు వచ్చేసరికి నా చూపు, ఆ కిటికీ వేపు మరలింది. వెంటనే ఆ ఎదురింటి కిటికీవేపు కదిలింది. ఆ రెండు కిటికీలు మూసేసివున్నాయి-తలుపులతో.

ఉక్కిరిబిక్కిరై పోతూన్న మనసుతో నేను వడివడిగా నడుస్తున్నాను—బస్సుస్టాండ్ వేపు.

మా వాళ్ళకు నేను కల్పించి రాసిన ఆ ఉత్తరం అందిపోయి వుంటుంది. వాళ్ళు విజయవాడ ఉత్తరం రాసేసి వుంటారా, వాళ్ళిచ్చిన అడ్వాన్సును పంపించేస్తూ?!—ఒకవేళ అలాగే జరిగి(పో)తే?—నా గతేం కాను? ★

TEXTOM®
VESTS & BRIEFS


Tel: TEXTOM Phone: 23209
TEXTOM KNITTERS
5-A (1) Ramanagar 4th Street TIRUPUR-638 602